నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 6 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

యాదగిరిగుట్ట పట్టణంలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అక్రమాలను ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీలా?

- బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల దాష్టీకం
- అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసులు
- యాదగిరి గుట్ట పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో
- ఎస్ఐ జ్ఞానేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్

పోలీసులు కొట్టిన దెబ్బలను చూపిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్త రాజశేఖర్

యాదగిరిగుట్ట, జూలై5 : బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం పట్ల ఆ పార్టీ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట ఎస్ఐ జ్ఞానేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తాళ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఆకుల రాజశేఖర్, సాయిపై కారంపొడి చల్లి, బెల్టులతో విచక్షణారహితంగా కొట్టారని బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ జనరల్ సెక్రటరీ పాపట్ల నరహరి మండిపడ్డారు. యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాన రోడ్డుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించారు. 'పోలీసుల జులూం నశించాలి. థర్డ్ డిగ్రీని ప్రయోగించిన ఎస్ఐ జ్ఞానేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి.. విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలి' అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పోలీసులు అధికార కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తున్నారన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అడ్డుకున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై పోలీసులు దాడికి దిగడం సరైంది కాదని తెలిపారు. చిన్న చిన్న గొడవలపై కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో బీఆర్ఎస్ కార్యకర్తలను రాత్రి సమయంలో పోలీస్‌స్టేషన్‌లో తీవ్రంగా కొట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మోకాళ్లు, చేతులు, మోచేతులపై తీవ్రంగా కొట్టారని బాధితులు నడవలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పదేండ్లు అధికారంలో ఉన్నా ఏనాడూ పోలీసులను ఉపయోగించుకొని ప్రతిపక్షాలపై దాడికి దిగలేదన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో ప్రశాంత వాతావరణంలో పోలీసులు విధులు నిర్వర్తించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తి కాకముందే పోలీసులు విచక్షణ కోల్పోయారని వాపోయారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదగిరి గుట్ట పట్టణంలో 2003లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని 22 ఏండ్లుగా కాపాడుకుంటూ వస్తున్నామని, కాంగ్రెస్ నాయకులు ఆ విగ్రహాన్ని తీసివేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించే వారిపై విచక్షణారహితంగా పోలీసులు దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు అరగంట పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాస్తారోకో వద్దకు చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్‌ను వివరణ కోరగా విగ్రహం వద్ద 15 ఏళ్లుగా కొబ్బరికాయలు విక్రయిస్తున్న లక్ష్మి అనే మహిళపై దాడిచేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను పోలీస్ స్టేషన్‌కు పిలిచామే తప్ప, వారిపై థర్డ్ డిగ్రీ అమలు చేయలేదని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా..

రాస్తారోకో అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎలాంటి నిర్మాణాలూ చేపట్టవద్దని, తోపుడు బండ్లు, షెడ్లకు అనుమతివ్వద్దని మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డిని కోరారు. విగ్రహం కనిపించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య కమిషనర్‌ను ప్రశ్నించారు. విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామ ని కమిషనర్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

డీసీపీకి వినతి..

తెలంగాణ తల్లి విగ్రహం ముందు ప్రాంతంలో మిర్చి బండ్లు, తోపుడు బండ్లు, శాశ్వత షెడ్లను నిర్మించవద్దని అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తల యాదగిరిగుట్ట సీఐ, ఎస్ఐ కలిసి థర్డ్ డిగ్రీ అమలు చేశారని, విచక్షణారహితంగా కొట్టారని డీసీపీ రాజేశ్ చంద్రకు బాధితులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య వివరించారు. యాదగిరిగుట్టలో ధర్నా అనంతరం జిల్లా కేంద్రంలో డీసీపీ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. థర్డ్ డిగ్రీని ప్రదర్శించిన యాదగిరిగుట్ట పోలీసులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌బాబా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆరె యాదగిరి, ఆరె శ్రీధర్‌గౌడ్, బాలయ్య, రేపాక స్వామి, దండెబోయిన వీరేశం, బిట్టు కుమార్, కల్వకొలను సతీశ్ భట్టు, రాజు, బాబా, వాసం రమేశ్, శారాజీ రాజేశ్ యాదవ్, గ్యాదపాక క్రాంతి, కిష్టయ్య, మహేందర్ పాల్గొన్నారు.

పోలీసులు కొట్టిన దెబ్బలను చూపిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్త రాజశేఖర్

జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతలు

జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, జులై 5 : జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టి జిల్లా పరిషత్‌కు కేటాయించిన ముగ్గురు విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు రికార్డ్ అసిస్టెంట్ పదోన్నతి ఉత్తర్వులపై సంతకం చేశారు. బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్. శోభారాణి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ సూపరింటెండెంట్లు కె.రమేశ్‌రెడ్డి, సుధాకర్ ఇతర అధికారులు పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు.

నిరుద్యోగుల నిర్బంధం

నిరుద్యోగ మార్చ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్ట్

- ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఉదయం నుంచే బీఆర్ఎస్, విద్యార్థి, యువజన సంఘాల నేతలు..
- నిరుద్యోగులతో నిండిన స్టేషన్లు
- సర్కారు తీరుపై సర్వత్రా ఖండన, తీవ్ర ఆగ్రహం
- అయినప్పటికీ భారీగా తరలివెళ్లిన నిరుద్యోగులు
- కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో బీజేపీ నేతలూ అదుపులోకి..

– యాదాద్రి భువనగిరి, జూలై 5 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వంపై నిరుద్యోగులు రణనినాదం మోగించారు. హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌పై కన్నెర్ర చేశారు. ఉద్యోగాల సాధన కోసం నడుం బిగించారు. నిరుద్యోగులపై ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ టీజీపీఎస్సీ నిరుద్యోగ మార్చ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిరుద్యోగులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఎక్కడికక్కడ నిరుద్యోగులు, బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే నేతల ఇండ్లలోకి వెళ్లి అరెస్ట్ చేశారు. దాంతో నిరుద్యోగులు, బీఆర్ఎస్ నేతలతో పోలీస్ స్టేషన్లు నిండిపోయాయి. మరోవైపు అనేక మంది టీజీపీఎస్సీ ముట్టడికి చాకచక్యంగా తరలివెళ్లారు. ముందస్తు అరెస్ట్‌లతో సర్కారు తీరుపై అన్ని వర్గాలు ఖండించడంతో పాటు సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

బీబీనగర్ : పోలీస్టేషన్‌లో అరెస్ట్ అయిన బీఆర్ఎస్వీ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు అనేక హామీలను ప్రకటించింది. తొలి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ప్రకటన, నిరుద్యోగ భృతి తదితర హామీలు పత్తాలేకుండా పోయాయి. గత ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి సొంత డబ్బా కొట్టుకోవడం తప్ప ఇప్పటి వరకు కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులకు చేసిందేమీలేదు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలుగా దాటినా కనీసం పట్టించుకోపోవడంపై నిరుద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున తరలివెళ్లేందుకు నిరుద్యోగులు ప్లాన్ చేశారు. ముట్టడిని ఎలాగైనా భగ్నం చేయాలని భావించిన ప్రభుత్వం..పోలీసులతో ముందస్తు అరెస్ట్‌లు చేయించింది. శుక్రవారం ఉదయం నుంచే నిరుద్యోగులతోపాటు బీఆర్ఎస్ నాయకులు, వివిధ విద్యార్థి, యువజన సంఘాల నేతల ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నిరుద్యోగ సమస్యలపై బీజేపీ, బీజేవైఎం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు బీజేపీ, బీజేవైఎం నేతలను ముందస్తు అరెస్ట్ చేశారు.

అరెస్ట్‌ల పర్వం..

- బీబీనగర్‌లో బీఆర్ఎస్వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్‌ను ఉదయమే అదుపులోకి తీసుకున్నారు.
- బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు జలంధర్ నాయక్, దేవానాయక్‌ను అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
- గుండాలలో బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఉప్పునూతల జగదీశ్, పట్టణ అధ్యక్షుడు బడుగుల శ్రీకాంత్‌ను ఉదయమే అదుపులోకి తీసుకున్నారు.
- రాజాపేటలో బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు పల్లె సంతోశ్‌ను అరెస్ట్ చేశారు.
- మోటకొండూరులో బీఆర్ఎస్వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలిపల్లి వెంకటేశ్ తోపాటు మండల అధ్యక్షుడు బీసీ కృష్ణరాజును అదుపులోకి తీసుకున్నారు.
- అడ్డగూడూరులో బీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి పయ్యావుల రమేశ్‌ను ముందస్తుగా అరెస్ట్ చేశారు.
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్‌ను అరెస్ట్ చేసి, తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
- వలిగొండలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్ట్ చేశారు.
- ఆలేరులో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల నరేశ్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.
- గుండాలలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అరెస్ట్ చేశారు.

సంస్థాన్ నారాయణపురం : బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ ను అరెస్ట్ చేసిన పోలీసులు

మోటకొండూరు : బీఆర్ఎస్వై ఆలేరు నియోజకవర్గ ప్రధానకార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీస కృష్ణంరాజుని ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు.

మాసాయిపేట వాసికి అమెరికా ప్రభుత్వ ఆహ్వానం

వెంకటేశం

యాదగిరిగుట్ట, జూలై5 : వాతావరణ శాస్త్రవేత్త హోదాలో మాసాయిపేట గ్రామానికి చెందిన వెంకటేశం ముదిరాజ్‌ను అమెరికా ప్రభుత్వం ఆహ్వానం పంపింది. క్లైమేట్ క్రైసెస్ ఫర్ వెదర్ ఇన్‌ఫ్లుయెన్సర్స్ ప్రాజెక్టులో పార్టిసిస్పెంట్‌గా తెలంగాణ రాష్ట్రం నుంచి సీనియర్ జర్నలిస్ట్, వెదర్ సైంటిస్ట్ వాకిటి వెంకటేశం ముదిరాజ్ ఎంపికయ్యారు. ఈ నెల 6నుంచి 27వరకు అమెరికాలోని వాషింగ్టన్ డీసీ, ఓక్లహామ్, కొలరాడో, ఫ్లోరిడా ప్రాంతాల్లో పర్యటించి, వాతావరణంపై అధ్యయనం చేయనున్నారు. ఈ అధ్యయన నివేదికను అమెరికా ప్రభుత్వానికి అప్పగించి, సుమారు నెల రోజుల అనంతరం తిరిగి భారతదేశానికి తిరిగిరానున్నారు. ఈయన గతంలో గూగుల్ న్యూస్ ఇన్సియేటివ్ ప్రాజెక్టుతో పాటు వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ఎంపిక పట్ల మెపా రాష్ట్ర కమిటీ ఆయనకు అభినందనలు తెలిపింది.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

యాదగిరిగుట్ట, జూలై5 : జూలై 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచల 'గిరి ప్రదక్షిణ' పాల్గొనే భక్తులకు యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో శుభవార్త తెలిపింది. డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. 19న రాత్రి 8 గంటలకు యాదగిరిగుట్టకు నుంచి బయల్దేరి 20న కాణిపాకం దర్శనం చేసుకుంటారని, మధ్యాహ్న భోజనం అనంతరం కాణిపాకం నుంచి బయల్దేరి సాయంత్రం 5 గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందని తెలిపారు. రాత్రి అక్కడి నుంచి బయల్దేరి 21న తెల్లవారుజామున పౌర్ణమి రోజున అరుణాచల గిరిప్రదక్షిణ పూర్తి చేసుకుని సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్టకు తిరుగు ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. 22న సోమ వారం ఉదయం 8 గంటలకు యాదగిరిగుట్ట చేరుకుం టుందని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు పెద్దలకు రూ. 4,000, చిన్నపిల్లలకు రూ. 2,500, డీలక్స్ బస్సు పెద్దలకు రూ. 3,800, చిన్నపిల్లలకు రూ. 2,300, ఎక్స్‌ప్రెస్ బస్సు పెద్దలకు 3,500, చిన్నపిల్లలకు రూ. 2,000 టికెట్ల ధర ఉంటుందని, టీ, టీఫిన్, భోజనం, దర్శనం టికెట్లు, వసతి ఖర్చులు ఎవరికి వారే భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహుడి ఆజ్ఞతో చాతుర్మాస దీక్ష

- తొగుట పీఠాధీశ్వరుడు మాధవానంద స్వామీజీ

ఆలయ ముఖ మండపంలో తొగుట పీఠాధీశ్వరుడు మాధవానంద స్వామీజీ

యాదగిరిగుట్ట, జూలై 5 : ఆషాడం నుంచి చాతుర్మాస దీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆజ్ఞతో నాలుగు నెలలపాటు దీక్షలో పాల్గొనేందుకు వెళ్తున్నట్లు తొగుట పీఠాధీశ్వరుడు మాధవానంద స్వామీజీ వెల్లడించారు. శుక్రవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఆయన దర్శించుకుని ఆశీస్సులు పొందారు. కొండపైకి చేరుకున్న స్వామీజీకి అర్చక బృందం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికింది. దర్శనం అనంతరం ముఖమండపంలో అర్చకులు, అనువంశికధర్మకర్తతో మాధవానందస్వామీజీ ముచ్చటించారు.

ఏటా చాతుర్మాస దీక్షకు ముందు స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహూర్తి దంపతులు స్వామివారికి పండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో దోర్భల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు పాల్గొన్నారు.

పక్కా స్కెచ్‌తో పార్థీ గ్యాంగ్ అరెస్ట్

- పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద సినీ ఫక్కీలో అదుపులోకి..
- పోలీసులపై కత్తులతో దాడికి యత్నం
- గాల్లోకి కాల్పులు జరిపి ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- గ్యాంగ్‌లోని మిగతా సభ్యుల కోసం గాలింపు
- ఇటీవల హైవేలే లక్ష్యంగా దోపిడీలు, దొంగతనాలకు పాల్పడిన గ్యాంగ్
- నేడు వివరాలు వెల్లడించనున్న ఎస్పీ పవార్?

అంబర్‌పేట వద్ద పోలీసులు పట్టుకున్న పార్థీ గ్యాంగ్ సభ్యులు

పోలీసులు వెంబడించి పట్టుకున్న వ్యాన్

నల్లగొండ ప్రతినిధి, జూలై5(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి లక్ష్యంగా గత రెండు నెలల నుంచి దోపిడీలు, దొంగతనాలు, హత్యలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్ సభ్యులను ఎట్టకేలకు నల్లగొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం, దేవలమ్మనాగారంలో దొంగతనాలకు పాల్పడి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న పార్థీ గ్యాంగ్‌ను శుక్రవారం తెల్లవారుజామున నల్లగొండ పోలీసులు వెంబడించారు. హైవేపై కొత్తగూడెం వద్ద ఆటో ఎక్కిన ఇద్దరు దొంగలను పోలీసులు ఆ వెనకాలే వెంబడిస్తూ అదునుకోసం వేచి చూశారు. ఇంతలోనే పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు దాటగానే ఓ మహిళ ఆటో ఆగింది. వెంటనే పోలీసులు ఆటోను చుట్టుముట్టారు. అప్రమత్తమైన దొంగలు కత్తులతో దాడికి యత్నించగా పోలీసులు ఫైరింగ్ ఓపెన్ చేశారు. గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరుపుతూ దొంగలను ఆటోలోనే బంధించారు. చేతులను తాళ్లతో కట్టివేసి అదే ఆటోలో విచారణ కోసం నల్లగొండకు తరలించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న గ్యాంగ్ సభ్యులు పార్థీ గ్యాంగ్‌లోని షిండే ముఠాకు చెందిన వారిగా పోలీసులు చెబుతున్నారు. వీరితోపాటు మరో నలుగురు దొంగలు కూడా ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న దొంగలను విచారించి మిగతా గ్యాంగ్ సభ్యులను కూడా అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిసింది. నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్థీ గ్యాంగ్ కదలికలపై ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. మొత్తం నాలుగు ప్రత్యేక బృందాలు వారం రోజులుగా ఇదే పనిలో నిమగ్నం కాగా శుక్రవారం గ్యాంగ్‌లోని ఇద్దరు సభ్యుల ఆటకట్టించడంలో పోలీసులు సక్సెస్ అయ్యారు.

ప్రత్యేక బృందాలతో నిఘా.

పెద్దకాపర్తి వద్ద నిద్రిస్తున్న కారులో దొంగతానికి పాల్పడిన సమయంలోనే అప్పటి ఎస్పీ చందనాదీప్తి దీన్ని సీరియస్‌గా తీసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హైవే వెంట ఉన్న సీసీ టీవీ రికార్డింగ్‌లను జల్లెడ పట్టారు. పలు హోటళ్ల వద్ద పార్థీ గ్యాంగ్ సభ్యులకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తించారు. సీసీ టీవీ రికార్డింగ్‌ల ప్రకారం మరింత నిఘా పెట్టారు. ఎస్పీ మారి కొత్త ఎస్పీగా శరత్ చంద్ర పవార్ బాధ్యతలు చేపట్టాక దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సీసీఎస్ పోలీసులతోపాటు సివిల్ పోలీసులతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిత్యం హైవేపై అనుమానిత వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టడంతో పాటు జరుగుతున్న దొంగతనాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఘటనలు జరిగిన అన్ని చోట్లా సీసీ టీవీ రికార్డులను పరిశీలిస్తూ ఓ అంచనాకు వచ్చారు. గ్యాంగ్‌లో ఇద్దరి సభ్యుల సీసీ టీవీల ఫొటోలను సేకరించి వాటి ఆధారంగా వారి కదలికలపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టి అదును కోసం వేచిచూశారు.

నేడు ఎస్పీ ప్రెస్‌మీట్?

పోలీసులు అదుపులో ఉన్న దొంగల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఎస్పీ డైరెక్షన్‌లో ప్రత్యేక బృందం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వీరు చెప్తున్న వివరాల ఆధారంగా మిగతా సభ్యుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఇప్పటికే రంగంలోకి దింపినట్లు తెలిసింది. శుక్రవారం అదుపులోకి తీసుకున్న ఇద్దరు పార్థీ గ్యాంగ్ దొంగల అరెస్టుకు సంబంధించి శనివారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రెస్‌మీట్ పెట్టనున్నట్లు తెలిసింది. గ్యాంగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, దొంగతనాలు, ఇతర అంశాలను ఎస్పీ వెల్లడించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

చౌటుప్పల్ పరిధిలో జరగిన దొంగతనంతో...

చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం, కొయ్యలగూడెంలో శుక్రవారం తెల్లవారుజామున పార్థీ గ్యాంగ్ దోపిడీలకు పాల్పడింది. దేవలమ్మనాగారంలో సందీప్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో బంగారం, 20వేల రూపాయలను దొంగతనం చేశారు. అక్కడి నుంచి కొయ్యలగూడెం వచ్చి ఒక ఇంట్లోకి చొరబడగా ఇంట్లో వారు మేల్కొనడంతో పారిపోయారు. పారిపోతూ అక్కడే కొన్ని మారణాయుధాలు వదిలివెళ్లారు. తెల్లవారుజామున జరిగిన దొంగతనాల విషయం తెలిసి నల్లగొండ పోలీసులు అలర్ట్ అయి హైవేపై మాటు వేశారు. ఈ క్రమంలో కొత్తగూడెం ఆటో ఎక్కిన ఇద్దరు దొంగలను అనుసరిస్తూ వెళ్లిన పోలీసు బృందం ఔటర్ రింగ్ రోడ్డు దాటగానే సంపూర్ణ హోటల్ ముందు ఆటో ఆగడంతో పోలీసులు చుట్టుముట్టి దొంగలను బంధించారు. వీరిని ఆ ఆటోలోనే నల్లగొండకు తీసుకువస్తున్న క్రమంలో పోలీసుల విచారణలో ఎరసానిగూడెం వద్ద లారీ డ్రైవర్ హత్యతో పాటు పెద్దకాపర్తి వద్ద కారులో నిద్రిస్తున్న వారి వద్ద దొంగతనం కూడా తామే చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. దాంతో ఇటీవల జరిగిన దొంగతనాలతోపాటు మిగతా గ్యాంగ్ సభ్యుల కోసం పోలీసులు విచారిస్తున్నారు. ట్టుబడిన దొంగలు పార్థీ గ్యాంగ్‌లోని షిండే వర్గానికి చెందిన వారుగా సమాచారం.

హైవేల వెంట పార్థీ గ్యాంగ్ హల్‌చల్

మే నెల ఆరంభం నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్థీ గ్యాంగ్ అలజడులు మొదలైనట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా హైవేలపై ఆగి ఉన్న వాహనాల్లో లేదంటే హైవే వెంట ఉన్న గ్రామాల్లోని ఇండ్లల్లో ఈ గ్యాంగ్ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్నది. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణంలో అలిసిపోయి రహదారి పక్కన వాహనాలు ఆపుకుని నిద్రపోయేవారిని ఈ గ్యాంగ్ టార్గెట్ చేసింది. నిద్రపోయేవారిని లేపి కత్తులు చూపి బెదిరించి దోపిడీకి పాల్పడుతున్నారు. ఇలా వాహనాల్లో నిద్రిస్తున్న వారి వద్ద నుంచి నగలు, నగదు దోచుకుంటూ హల్‌చల్ చేస్తుండడం వాహనదారులు, నల్లగొండ పోలీసులకు కంటి మీద కనుకు లేకుండా చేస్తున్నది. మే 18న ఏపీ నుంచి సరకును హైదరాబాద్‌లో దిగుమతి చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో అలసిపోయి కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద పార్కింగ్ స్థలంలో ఆపిన మినీ డీసీఎం డ్రైవర్ హత్యకు గురయ్యాడు. దుండగులు అతని కాళ్లను కట్టేసి, గొంతు నులిమి దారుణంగా హత్య చేసి అవతలి వైపు రహదారి పక్కన పడేశారు. మే 19న అదే ప్రాంతంలో ఆగి ఉన్న లారీ నుంచి 250 లీటర్ల డీజిల్‌ను దొంగతనం చేశారు. గత నెల 23న కట్టంగూర్ మండలం అయిటిపాముల వద్ద మరో దొంగతనం చేశారు. 28న నకిరేకల్ పటేల్‌నగర్‌లో ఓ ఇంట్లో 8 తులాల బంగారం ఎత్తుకు పోయారు. గత నెల 9న తెల్లవారుజామున ఏపీ నుంచి హైదరాబాద్ వెళ్తున్న తూర్పుగోదావరి జిల్లా వాసులు ప్రయాణంలో అలసిపోయి చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద సర్వీసు రోడ్డు లో కారు ఆపారు. అందులో నిద్రిస్తున్న వారిపై ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి దాడి చేశారు. ప్రయాణికుల దగ్గర ఉన్న సుమారు 10 తులాల బంగారాన్ని అపహరించారు. తాజాగా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న వాహనదారులు అలసిపోయి స్వాతి హోటల్ వద్ద పక్కకు పార్కు చేసి నిద్రపోయారు. ఇదే అదునుగా దోపిడీ దొంగలు కారులో రెండు లక్షల రూపాయలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో ఒక్కసారిగా హైవేపై దోపిడీ దొంగల కలకలం రేపింది.

13 మంది ఎస్ఐల బదిలీలు

భువనగిరి అర్బన్, జూలై 5 : రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో 13 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ రాచకొండ సీపీ తరుణ్‌జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పలు పోలీస్‌స్టేషన్